సాక్షి
కామారెడ్డి
శనివారం । 19 । జూలై । 2025



నూతన శకానికి నాంది

రేషన్‌కార్డుల పంపిణీతో నూతన శకానికి నాంది పలికామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.

- 8లో ▸



ఎన్నికలకు సిద్ధం కావాలి

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సూచించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.7 /24.0

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ అడపాదడపా జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'నాగమడుగు పైపులైన్ పనులకు సహకరించాలి'



నిజాంసాగర్: మంజీర నదిపై నిర్మిస్తున్న నాగమడుగు ఎత్తిపోతల పథకం పైపులైన్ పనులకు రైతులు సహకరించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నాగమడుగు ఎత్తిపోతల పైపులైన్‌లో భూములు కోల్పోతున్న రైతులతో సబ్ కలెక్టర్ సమావేశం అయ్యారు. నాగమడుగు పనులు ఒక్కొక్కటిగా ముందుకు సాగుతున్నాయన్నారు. ఫేజ్ వన్‌లో 9 కిలోమీటర్ల వరకు పైపులైన్‌లో భూములు కోల్పోతున్న ఒడ్డేపల్లి, జక్కాపూర్ గ్రామాలతో పాటు మల్లూర్ గ్రామ రైతులు సహకరించాలన్నారు. పైపులైన్ ఏర్పాటుకు రైతుల ఆధ్వర్యంలో రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు సర్వే చేశారన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ భిక్షపతి, రైతు నాయకులు సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి విద్యార్థి మొక్కను నాటి సంరక్షించాలి'



కామారెడ్డి అర్బన్: ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(వన్యప్రాణుల సంరక్షణ) ఎలుసింగ్ మేరు సూచించారు. శుక్రవారం గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన వనమహోత్సవంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. వన్యప్రాణులుంటేనే అడవుల రక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులందరు మొక్కలు నాటాలని, అడవులను సంరక్షించడంగా ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో నిఖిత, కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి, కామారెడ్డి డివిజన్ అటవీ అధికారి రామకృష్ణ, రేంజ్ అధికారి రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

23న జాబ్ మేళా

కామారెడ్డి అర్బన్: కలెక్టరేట్‌లోని 121 వ నంబర్ గదిలో ఈనెల 23న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్‌లో పలు ఉద్యోగాల భర్తీ కోసం ఈ జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వయసుండి, పదో తరగతి ఫెయిల్ అయినవారూ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 99856 78292, 76719 74009 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మొరాయించిన రైల్వే గేటు



నిజామాబాద్ రూరల్: నగర శివారులోని మాధవనగర్ వద్ద రైల్వే గేటు మొరాయించడంతో అరగంటపాటు వాహనదారులు ఇబ్బందిపడ్డారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్ వైపు (అకోలా- కాచిగూడ) రైలు వస్తోంది. దీంతో గేట్‌మన్ గేటు వేస్తుండగా మధ్యలోనే ఆగిపోయింది. ఒకవైపు రైలు వస్తుండడం, మరోవైపు గేటు పూర్తిగా కిందికి దిగకపోవడంతో వాహనదారులను ఆపేందుకు గేట్‌మన్ ముప్పుతిప్పలు పడ్డాడు. చివరకు తాత్కాలిక గేటును వేశాడు. కొందరు వాహనదారులు గేట్లకు మధ్యలోనే నిలిచిపోయారు. గమనించిన లోకో పైలట్ రైలును నెమ్మదిగా నడిపాడు. వెంటనే రైల్వే సిబ్బంది గేటుకు మరమ్మతులు చేశారు.

పెన్షన్ల హామీ మరిచిన కాంగ్రెస్ సర్కారు

నిజామాబాద్‌అర్బన్: అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన ఆసరా పెన్షన్ల పెంపు హామీని ప్రభుత్వం అమలు చేయడం లేదని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. నగరంలోని లక్ష్మి కల్యాణ మండపంలో శుక్రవారం పెన్షన్‌దారుల, దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగుల పెన్షన్‌ను రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు.

విచ్చలవిడిగా గర్భవిచ్ఛిత్తి



జిల్లాలో యథేచ్ఛగా గర్భ విచ్ఛిత్తి మాత్రల విక్రయాలు జరుగుతున్నాయి. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే అబార్షన్ పిల్స్ అమ్ముతున్నారు. మెడికల్ షాప్‌లలో ఔషధ నియంత్రణ అధికారుల దాడులతో ఈ విషయం బయటపడింది. జిల్లాలో రెండు దుకాణాలపై చర్యలు తీసుకున్నారు.

- ప్రిస్క్రిప్షన్ లేకుండానే యథేచ్ఛగా మాత్రల విక్రయాలు
- మెడికల్ షాపుల్లో తనిఖీలతో వెల్లడి
- రెండు దుకాణాలపై చర్యలు తీసుకున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : గర్భవిచ్ఛిత్తి మాత్రల అమ్మకాలపై రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్ కంట్రోల్ అధికారులు మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా కామారెడ్డి జిల్లాలో నిర్వహించిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా గర్భవిచ్ఛిత్తి మాత్రలు అమ్ముతున్న రెండు మెడికల్ షాపులను గుర్తించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఒక మెడికల్ షాపు, భిక్కనూరులో మరో షాపులో అబార్షన్ పిల్స్ అమ్ముతున్నట్లు గుర్తించి వారం రోజుల పాటు లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు.

జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి లింగ నిర్ధారణ పరీక్షలు, అనంతరం అబార్షన్లకు కేరాఫ్‌గా మారిన వ్యవహారం అప్పట్లో సంచలనం కలిగించింది. తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా లింగ నిర్ధారణ పరీక్షల కోసం నిత్యం పదుల సంఖ్యలో వచ్చేవారు. ఆడపిల్ల అని తెలిస్తే చాలు అబార్షన్ చేయించుకోవడానికి వెనుకాడని పరిస్థితుల్లో విచ్చలవిడిగా అబార్షన్లు చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలతో పాటు అబార్షన్లకు కారణమైన ఆ ఆస్పత్రి వైద్యుడిపై, ఆస్పత్రిపై వైద్య ఆరోగ్య శాఖ అప్పట్లో చర్యలు తీసుకుంది. ఆ ఉదంతం మరిచిపోకముందే జిల్లాలో గర్భవిచ్ఛిత్తి మాత్రల విక్రయాలు ఓపెన్‌గా, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న వ్యవహారం ఔషధ నియంత్రణ శాఖ అధికారుల తనిఖీల్లో వెలుగు చూసింది. దీంతో డ్రగ్ అధికారులు సదరు దుకాణాలపై చర్యలకు ఉపక్రమించారు. ఐదు దుకాణాలను తనిఖీ చేయగా.. రెండు షాపుల్లో గర్భవిచ్ఛిత్తి మాత్రలు అమ్ముతున్నట్లు నిర్ధారించారు. దీంతో వారం రోజుల పాటు వారి లైసెన్స్‌లను సస్పెండ్ చేశారు.

రికార్డుల నిర్వహణ గాలికి..

మెడికల్ షాపుల్లో మందుల విక్రయాలన్నీ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ద్వారానే సాగాలి. అబార్షన్లకు సంబంధించిన ట్యాబ్లెట్ కిట్లను తప్పనిసరిగా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే ఇవ్వాలి. ఏ ఏజెన్సీ నుంచి ఎన్ని కిట్లు తెచ్చారో, ఎన్ని అమ్మారో రికార్డులు నిర్వహించాలి. కానీ మెడికల్ షాపుల్లో ఇవేవీ పాటించడం లేదు. ఇది విస్మయం కలిగిస్తోంది. కడుపులో పెరుగుతున్న శిశువు వల్ల తల్లి ప్రాణానికి అపాయం ఉన్నప్పుడు, శిశువు ఎదుగుదల సరిగ్గా లేనప్పుడు గైనకాలజిస్టు పర్యవేక్షణలో కుటుంబ సభ్యుల అనుమతితో గర్భవిచ్ఛిత్తికి సంబంధించిన ట్యాబ్లెట్స్ వాడాల్సి ఉంటుంది. కొందరు అవాంఛిత గర్భాన్ని తొలగించుకునేందుకు మెడికల్ షాపుల్లో మాత్రలు కొనుక్కుని మింగుతున్నారు. అవి వికటించి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడిన ఉదంతాలూ ఉన్నాయి. మాదక ద్రవ్యాల నియంత్రణ మీద దృష్టి పెట్టిన ప్రభుత్వం ఔషధాల విక్రయాలపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఔషధ నియంత్రణ శాఖకు అవసరమైన మేర సిబ్బందిని, అధికారులను కేటాయించినప్పుడే ఇది సాధ్యపడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పుష్కర కాలం తర్వాత

బడి పునఃప్రారంభం

భిక్కనూరు : మోటాట్‌పల్లిలో పుష్కర కాలం క్రితం మూతబడిన ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో రాజగంగారెడ్డి పునఃప్రారంభించారు. విద్యార్థులు లేకపోవడంతో ఈ పాఠశాలను 2013 సంవత్సరంలో మూసివేశారు. ఈ బడిని తిరిగి ప్రారంభించేందుకు ఎంఈవో కృషి చేశారు. గత నెలలో గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడగా.. 28 మందిని బడిలో చేర్పించారు. దీంతో జిల్లా అధికారులు ఈ బడిని పునఃప్రారంభించడానికి చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఎంఈవో రాజగంగారెడ్డి సరస్వతి పూజ నిర్వహించి పాఠశాలను ప్రారంభించారు. తొలి రోజు పది మంది విద్యార్థులు హాజరు కాగా వారికి పాఠ్యపుస్తకాలతో పాటు, నోటుబుక్స్, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రారంభానికి కృషిచేసిన ఉపాధ్యాయులు, ఎంఈవోకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సబితా రాణి, గ్రామపంచాయతీ సెక్రెటరీ శ్రీధర్, మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది వైద్య సంపత్ తదితరులు పాల్గొన్నారు.



మోటాట్‌పల్లి పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందిస్తున్న ఎంఈవో రాజగంగారెడ్డి, టీచర్లు

ఎస్సెస్సీలో ప్రథమ స్థానం సాధించాలి

కామారెడ్డి టౌన్ : ఈ విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానం సాధించేలా విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో విద్యాశాఖ మండల అధికారులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యార్థుల హాజరు వంద శాతం నమోదయ్యేలా చూడాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం, రుచికరమైన మధ్యాహ్నం భోజనం అందించాలన్నారు. భవిత సెంటర్లలో, కేజీబీవీల్లో సివిల్ వర్క్సను వెంటనే పూర్తి చేయాలన్నారు.

వయోజన విద్య ఓపెన్ స్కూల్, టాస్ అడ్మిషన్‌లను పెంచాలన్నారు. ఎక్కువ సంఖ్యలో పాఠశాలలను విజిట్ చేయని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఈవో రాజు, అధికారులు పాల్గొన్నారు.

'వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి'



విద్యార్థితో మాట్లాడుతున్న అబ్జర్వర్ ఒడ్డెన్న

నిజాంసాగర్ : విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధిస్తేనే ప్రభుత్వ కళాశాలలకు గుర్తింపు వస్తుందని ఇంటర్ బోర్డు అబ్జర్వర్ ఒడ్డెన్న పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, సామగ్రి, లెక్చరర్ల వివరాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్లను మరింత పెంచాలన్నారు. ఈ నెలాఖరు వరకు విద్యార్థులకు చేర్చుకోవాలని సూచించారు. అధ్యాపకుల్లో మార్పు వస్తేనే విద్యార్థుల్లో మార్పు వస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు బస్ సౌకర్యం లేకపోవడంతో పాటు వసతి గృహ సదుపాయం లేనందున విద్యార్థులు కళాశాలలో చేరడానికి వెనకడుగు వేస్తున్నారని లెక్చరర్లు తెలిపారు. ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఒడ్డెన్న పేర్కొన్నారు. జూనియర్ కళాశాలకు సొంత భవనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అహ్మద్ ఫారుఖ్ తదితరులున్నారు.

హాజరు శాతాన్ని పెంచండి

పిట్లం: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఒడ్డెన్న అధ్యాపకులకు సూచించారు. శుక్రవారం ఆయన పిట్లం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి, అధ్యాపకులతో సమావేశమయ్యారు. మండలంలో మొత్తం 569 మంది విద్యార్థులు పదో తరగతి పాసయ్యారని, ఇందులో 119 మంది మాత్రమే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరారని పేర్కొన్నారు. ఎందుకు విద్యార్థుల జాయినింగ్ శాతాన్ని పెంచలేదని ప్రశ్నించారు. విద్యార్థుల సంఖ్య పెంచాలని ఆదేశించారు. కళాశాలలో సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ప్రతినెల రూ. 12 వేల చొప్పున నిధులు మంజూరవుతున్నాయన్నారు. ఇంకా ఏమైనా అవసరం ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రికార్డులను పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు.

ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని ప్రణాళికబద్ధంగా చదవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరును పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. హాజరు శాతం మెరుగయ్యేలా శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. రోజూ పాఠశాలకు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించేలా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఈవో రాజు, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, విద్యాశాఖ సమన్వయకర్త వేణుగోపాల్, హెచ్‌ఎం కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

కామారెడ్డి క్రైం: అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. అమృత్ పథకంలో భాగంగా నిర్మాణంలో ఉన్న పైప్‌లైన్ పనులను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్, మెగా సంస్థ ప్రతినిధులకు పలు సూచనలు ఇచ్చారు. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు నీటి సరఫరా కోసం ప్రత్యేకంగా పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కొత్త బస్టాండ్ ప్రాంతంలో డ్రెయినేజీ పూడికతీత పనులను పరిశీలించారు. వ్యర్థాలను వెంటనే అక్కడి నుంచి తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రాజేందర్ తదితరులున్నారు.

ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

కామారెడ్డి టౌన్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు తమకు కావాల్సిన ఇసుక కోసం తెలంగాణ ఖనిజాభివృద్ధి శాఖకు చెందిన ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించి ఇసుక అవసరంపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఎంత ఇసుక అవసరముంది, జిల్లాలో ఎంత ఇసుక అందుబాటులో ఉంది అన్న వివరాలు తెలుసుకున్నారు. ఇసుక కోసం పోర్టల్‌లో నమోదు చేసుకున్న వెంటనే ఆలస్యం చేయకుండా రవాణాకు అనుమతి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, గనులు, భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నగేశ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

వామ్మో.. పులులు!

- రెడ్డిపేట అడవిలో గాండ్రించిన పులి
- రాజమ్మ తండా ప్రాంతంలో సంచరించిన చిరుత
- అటవీ ప్రాంత గ్రామాల్లో భయాందోళనలు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను ఓ వైపు పులి.. మరోవైపు చిరుతలు వణికిస్తున్నాయి. ఆవుపై పులి దాడి చేసిన సంఘటనతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమై దాని జాడ కనుక్కునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే మరోవైపు చిరుత మరో ఆవుపై దాడి చేసి చంపిన సంఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామాలలో భయాందోళనలు నెలకొన్నాయి.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నిజామాబాద్ జిల్లాలోని సిరికొండ అటవీ ప్రాంతంలో ఈనెల 10న పెద్దపులి ఆనవాళ్లు వెలుగు చూశాయి. 12న కామారెడ్డి జిల్లాలోని రెడ్డిపేట స్కూల్ తండా సమీపంలోగల అటవీ ప్రాంతంలో ఆవుపై పులి దాడి చేసింది. అప్పటి నుంచి ఉమ్మడి జిల్లా అధికారులు పులి జాడ కోసం అడవిని జల్లెడ పడుతున్నారు. ఇరవై చోట్ల కెమెరా ట్రాప్స్ ఏర్పాటు చేశారు. దాని ఆచూకీ కోసం నాలుగు బృందాలు అన్వేషిస్తున్నా ఫలితం లేదు. పులి తిరిగిన ఆనవాళ్లు దొరికినప్పటికీ పులి ఎక్కడ ఉందన్న దానిపై స్పష్టత రావడం లేదు. మరోవైపు ఈనెల 13న నిజామాబాద్ నగరంలోని నాగారం సమీపంలో చిరుత కనిపించింది. గురువారం రాత్రి రామారెడ్డి మండలంలోని గోకుల్ తండా ప్రాంతంలో ఓ ఆవుపై చిరుత దాడి చేసి చంపేసింది. ఇలా అటు పులి, ఇటు చిరుతల సంచారంతో అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

మేతకు తీసుకు వెళ్లాలంటేనే వణుకు..

పశువులు, మేకలను పోషిస్తూ జీవించేవారు వాటిని మేత కోసం అటవీ ప్రాంతాలకు తీసుకువెళుతుంటారు. అయితే పులి, చిరుతల సంచారంతో వారు భయపడుతున్నారు. ఇప్పటికే రెండు మూడు సంఘటనలు జరగడంతో ఎక్కడ తమపై దాడి చేస్తాయోనని వణుకుతున్నారు. మాచారెడ్డి, రామారెడ్డి, సదాశివనగర్, సిరికొండ మండలాల పరిధిలోని అటవీ ప్రాంతంలో చాలా గ్రామాల ప్రజలు పశువులు, మేకలను అడవులకు తీసుకువెళ్లేవారంతా భయంతోనే వెళుతున్నారు. కొందరు ఇంతకు ముందులా అడవి లోపలికి వెళ్లడం లేదని చెబుతున్నారు. అలాగే అడవిని ఆనుకుని ఉన్న పంట చేల వద్దకు వెళ్లడానికి కూడా రైతులు, కూలీలు భయపడాల్సిన పరిస్థితి ఉంది. పొలం పనులకు వెళ్లిన వారు చీకటి పడకముందే ఇళ్లకు చేరుకుంటున్నారు. రాత్రి పూట పొలాలవైపే చూడడం లేదు.

అటవీ అధికారులకు సవాల్..

అడుగుల ఆనవాళ్లతో పులి వచ్చిందని కచ్చితమైన నిర్ధారణకు వచ్చిన అటవీ అధికారులు.. దాని కదలికలను పసిగట్టేందుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. వారం రోజులుగా దాని జాడ కోసం వెతుకుతున్నారు. పులి ఏదేని పరిస్థితుల్లో వేటగాళ్ల ఉచ్చుకు బలైతే ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. అందుకే నాలుగు బృందాలు అడవిలో జల్లెడపడుతున్నాయి. పులి కదలికలను గుర్తించేందుకు కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేసినా ఫలితం లేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం రెడ్డిపేట అడవిలో పులి తిరిగిన ప్రాంతాన్ని అటవీ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఏలు సింగ్ మేరు, జిల్లా అటవీ అధికారి నిఖిత, కామారెడ్డి డీఎస్పీ చైతన్యరెడ్డి తదితరులు పరిశీలించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు.



కెమెరాలో రికార్డయిన దృశ్యాలను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ ఏలుసింగ్ మేరు, డీఎఫ్‌వో నిఖిత

దూడను చంపింది చిరుతే..

రామారెడ్డి: గోకుల్ తండాలో గురువారం రాత్రి పెద్దపులి సంచారంపై అటవీశాఖ అధికారులు స్పందించారు. ఆవుపై దాడి చేసింది పెద్దపులి కాదని చిరుతపులి అని తేల్చారు. ట్రాక్ కెమెరాలో ఈ దాడి నిక్షిప్తమైందని పేర్కొన్నారు. అలాగే చిరుత దాడి చేసింది ఆవుపై కాదని, లేగ దూడపై అని తెలిపారు. శుక్రవారం లేగ దూడకు పోస్టుమార్టం నిర్వహించిన అధికారులు.. వైకుంఠధామం పక్కనే దహనం చేశారు. పులి జాడ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని అటవీశాఖ అధికారులు తెలిపారు.



వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

రామారెడ్డి: మండలంలోని స్కూల్‌తండాతో పాటు ఇందల్వాయి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తోందని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(వన్యప్రాణుల సంరక్షణ) ఏలుసింగ్ మేరు తెలిపారు. పులి కోసం రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నా దాని జాడ కనిపించలేదని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్కూల్ తండా పరిధిలోని అటవీ ప్రాంతంలో పర్యటించారు. ఆవుపై పెద్దపులి దాడి చేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంత సమీపంలోని గ్రామాల్లో చాటింపు వేయించి పెద్దపులి సంచరిస్తున్న విషయాన్ని తెలియజేశామన్నారు. వారం రోజులుగా అటవీ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్నారన్నారు. అటవీ జంతువులకు హాని కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో నిఖిత హెచ్చరించారు. పులిపై విషప్రయోగం జరిపిన ఘటనలో ఇప్పటికే నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన విషయాన్ని తెలిపారు. క్రూరమృగాలు కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందిస్తే తొందరగా వాటిని పట్టుకునేందుకు వీలవుతుందన్నారు. వారం రోజులుగా వెతుకుతున్నా పులి కనిపించడం లేదంటే అది వెళ్లిపోయినట్లు కాదన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎస్పీ చైతన్యరెడ్డి, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆపదలో ఆపన్న హస్తం సీఎంఆర్‌ఎఫ్‌



బాన్సువాడ రూరల్‌: ఆపదలో పేదల పాలిట ఆపన్న హస్తం సీఎం రిలీఫ్‌ ఫండ్‌ అని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడలోని తన నివాసంలో నియోజకవర్గంలోని 66 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. రోగాలు, ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల్లో వెచ్చించిన బిల్లులను ప్రభుత్వానికి సమర్పిస్తే సీఎం రిలీఫ్‌ పేరిట ఆర్థికసాయం అందజేస్తుందన్నారు.

క్రీడా సామగ్రి అందజేత



మాచారెడ్డి: జిల్లా కేంద్రానికి చెందిన నీల వెంకటేష్‌ మండలంలోని లచ్చాపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం రూ.10 వేల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఉపాధ్యాయులు సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం లక్కిరెడ్డి రాజేశ్వర్‌ రెడ్డి, ఉపాధ్యాయులు లింగారెడ్డి, అఖిల్‌ హుస్సేన్‌, శ్రీనివాస్‌ పారినాయుడు, రాజేశ్వరి, రమేష్‌ ఖురేషియా మోయిన్‌, నరసింహులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాల తనిఖీ



భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రితోపాటు మండలంలోని బస్వాపూర్‌ ఆరోగ్య ఉప కేంద్రాన్ని శుక్రవారం ఎన్సీడీ జిల్లా కో–ఆర్డినేటర్‌ ఊహశ్రీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య ఉప కేంద్రంలో ఎన్సీడీ స్క్రీనింగ్‌ వివరాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ఎప్పటికప్పుడు మందులను పంపిణీ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆరోగ్య విస్తర్ణ అధికారి వెంకటరమణ, ఏఎన్‌ఎం యాదమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తుకు బానిసవుతున్న బాల్యం

- చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలు నాశనం
- వద్దని వారిస్తే తిరగబడుతున్న వైనం



సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): 'బాల్యం' మత్తుకు బానిసవుతోంది. చెడువ్యసనాలకు అలవాటు పడి తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్య నేర్పిస్తున్న గురువులు ప్రయత్నిన్నా ప్రయోజనం లేకుండా పోతుంది. టీచర్లపైనే ఆగ్రహం వ్యక్తం చేస్తూ దండిస్తే తల్లిదండ్రులుతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. దీంతో టీచర్లు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

గౌరవం లేకుండా పోయింది..

ఒకప్పుడు దారిలో విద్య నేర్పిన గురువులు కనిపిస్తే ఎదురెళ్లి వినయంగా రెండు చేతులు జోడించి నమస్కరించే వారు. టీచర్లు దండించడం వల్లే తాము మంచి ప్రయోజకులం అయ్యామని అప్పటి విద్యార్థులు చెబుతుంటారు. ప్రస్తుతం ఆ పరిస్థితి భిన్నంగా మారిపోయింది. ఇందుకు కొంత మంది తల్లిదండ్రుల తీరే కారణమని స్పష్టమవుతోంది. చదవకపోతే దండించినా, పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను బెదిరించడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

నైతిక విలువలపై అవగాహన కల్పించాలి..

పాఠశాలల్లో విద్యార్థులకు నైతిక విలువల పట్ల కనీస అవగాహన కల్పించాలి. చదువుపై దృష్టి సారించేలా చూడాలి. సమస్యలు ఎదురైతే ఎలా ఎదుర్కోవాలో వారికి వివరించాలి. జీవితమంటే సరదాలు, షికార్లు కాదని చెప్పాల్సిన అవసరముంది. లక్ష్యాలను నిర్దేశించుకొని విద్యార్థులను గమనిస్తూ వారి తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలి.

మొగ్గలోనే తుంచేస్తే మేలు..

ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో పిల్లల మంచి చెడులు గమనించి వారితో సమయం గడిపే పరిస్థితుల్లో తల్లిదండ్రులు లేకపోవడంతో వారు పక్కదారి పట్టేందుకు అవకాశం ఏర్పడుతోంది. పిల్లల కోసం రోజూ కొంత సమయాన్ని కేటాయించాలి. వారి దినచర్యను గమనిస్తూ ఉండాలి. ఖర్చులకు ఇస్తున్న డబ్బులు ఎక్కువగా దేని కోసం ఖర్చు చేస్తున్నారనే విషయాన్ని పసిగట్టాలి. పిల్లలు చెడు వ్యసనాలకు బానిసైనట్లు తెలిస్తే కౌన్సిలింగ్‌ ఇప్పించాలి. క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి.

లక్షణాలు ఉంటే అప్రమత్తం కావాల్సిందే..

- ఇంట్లో తరచూ డబ్బులు పోతుండటం
- ఏదైనా ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానం చెప్పడం, చిరాకు పడటం, ఫోన్‌లో మునిగిపోవడం, ఒంటరిగా గడపడం
- నిద్రలేమి, కళ్లు ఎర్రగా మారి రెప్పల కింద గుంతలు ఏర్పడటం, పెదవులు పొడిగా మారడం, శరీర పరిశుభ్రత పాటించకపోవడం.
- రోజురోజుకు బలహీనంగా మారడం

డ్రగ్స్‌తో ఆరోగ్యానికి హానికరం



సిగరెట్ల వల్ల క్యాటరాక్ట్‌ వినికిడి శక్తి కోల్పోవడం, జ్ఞాపకశక్తి కోల్పోవడం, నోరు ఊపిరితిత్తుల క్యాన్సర్‌, గుండె జబ్బులు వంటి సమస్యలు వస్తాయి. మద్యం అధికంగా తీసుకోవడం వల్ల కాలేయ, గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా పెరుగుతాయి.

– ఆస్మా అఫ్షిన్‌, వైద్యాధికారిణి, సదాశివనగర్‌

అవగాహన కల్పిస్తున్నాం



పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం. మద్యం, బెల్టు దుకాణాలపై నిఘా పెట్టాం. మైనర్లకు మద్యం, సిగరెట్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలల్లో సైబర్‌ డ్రగ్స్‌ వంటి కేసులపై అవగాహన కల్పిస్తున్నాం .మాదక ద్రవ్యాల అక్రమ వ్యాపారం, రవాణాను ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకుంటాం.

– పుష్పరాజ్‌, ఎస్సై, సదాశివనగర్‌

ఉత్తీర్ణత శాతంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఇంటర్‌ బోర్డు ప్రత్యేక అధికారి ఒడ్డెన్న

మద్నూర్‌(జుక్కల్‌): ఇంటర్‌లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గుతోందని కళాశాల లెక్చరర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తీర్ణత శాతం పెంచాలని ఇంటర్‌ బోర్డు ప్రత్యేకాధికారి ఒడ్డెన్న ఆదేశించారు. మండల కేంద్రంలోని రాంసుఖ్‌ బాల్‌ ముకుంద్‌ ఇనాని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతంపై ఆయన ఆరా తీశారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించి వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్‌ పాండురంగ్‌, లెక్చరర్లు గంగాధర్‌, తదితరులున్నారు.

సమస్యలుంటే షీ టీమ్స్‌కు సమాచారం ఇవ్వాలి

రామారెడ్డి: రామారెడ్డి కేజీబీవీలో శుక్రవారం సైబర్‌ నేరాలు, మాదక ద్రవ్యాలు, షీటీమ్స్‌, రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థినులకు పోలీస్‌ కళాబృందం సభ్యులు పాటలతో అవగాహన కల్పించారు. ఏఎస్సై సంపత్‌ మాట్లాడుతూ.. విద్యార్థినులకు ఎలాంటి సమస్యలున్నా షీ టీమ్స్‌ నంబర్‌ 8712686094ను సంప్రందించాలన్నారు. అలాగే 1930, డయల్‌ 100ను ఉపయోగించుకోవాలని సూచించారు. సోషల్‌ మీడియాతో జాగ్రత్తగా ఉండాలన్నారు. రామారెడ్డి ఏఎస్సై సంపత్‌, కానిస్టేబుల్‌ పవన్‌, కేజీబీవీ ఎస్‌వోటీ వనిత పాల్గొన్నారు.

మద్నూర్‌ ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి



ఎంఐఎస్‌ కోఆర్డినేటర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయులు

మద్నూర్‌(జుక్కల్‌): మద్నూర్‌ ఎంఈవో రాములు ఏకపక్ష నిర్ణయాలతో గందరగోళం సృష్టిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తపస్‌ నాయకులు శుక్రవారం ఎంఈవో కార్యాలయంలో ఎంఐఎస్‌ కో–ఆర్డినేటర్‌ రవికాంత్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా తపస్‌ జిల్లా నాయకులు మాట్లాడుతూ.. ఎంఈవో రాములు టీచర్ల సర్దుబాటు ప్రక్రియ సంఖ్యను ప్రామాణికంగా పాటించకుండా లిస్టులు తయారు చేశారని ఆరోపించారు.

మరాఠీ మీడియంకు చెందిన టీచర్‌ను తెలుగు మీడియం గర్ల్స్‌ ప్రైమరీకి కేటాయించారని, సంఖ్య ఎక్కువగా ఉన్న చోట ఎక్కువ మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నా వారిని సర్దుబాటు చేయలేదని ఆరోపించారు. సర్దుబాటు ప్రక్రియలో న్యాయం పాటించాలని వినతి పత్రం అందించామన్నారు. త్వరలో పైఅధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. తపస్‌ నాయకులు రచ్చ శివకాంత్‌, గోజే సంజీవ్‌, పండరీనాథ్‌, అజిత్‌ పవార్‌ తదితరులున్నారు.

లిఫ్టు సదుపాయం కల్పిస్తే సహకరిస్తాం



మాట్లాడుతున్న వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

నిజాంసాగర్‌(జుక్కల్‌): నాలుగు గ్రామాలకు లిఫ్టు సదుపాయం కల్పిస్తేనే మంజీరా నదిపై నాగమడుగు ఎత్తిపోతల పనులకు సహకరిస్తామని రైతు నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి స్పష్టం చేశారు. నాగమడుగు ఎత్తిపోతల పైపులైన్‌ ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.30 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్‌ చేశారు. శుక్రవారం నిజాంసాగర్‌ మండల పరిషత్‌ కార్యాలయం వద్ద స్థానిక రైతులు, నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. నాగమడుగు ఎత్తిపోతల నిర్మాణానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. పంపుహౌస్‌తో పాటు పైపులైన్‌ పనుల్లో భూములు కోల్పోతున్న వడ్డేపల్లి, మల్లూర్‌, జక్కాపూర్‌ గ్రామాల భూనిర్వాసిత రైతులకు ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా పరిహారం చెల్లించాలన్నారు. అంతే కాకుండా ఆయా గ్రామాలతో పాటు గిరిజన తండాల పరిధిలోని 2,593 ఎకరాల భూములకు లిఫ్టు ద్వారా సాగు నీరు అందించాలని కోరారు. నాయకులు ప్రదీప్‌ పటేల్‌, పెద్ది అంజయ్య, గౌస్‌, శ్రీనివాస్‌, రవీందర్‌సేట్‌, అంజయ్య తదితరులున్నారు.

ఉపాధ్యాయులుగా మారిన వైద్య సిబ్బంది

- ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు సైన్స్‌ పాఠాల బోధన



డిజిటల్‌ బోర్డుపై విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్న డాక్టర్‌ సృజన్‌కుమార్‌

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట హైస్కూల్‌లో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలను బోధించారు. పాఠశాలలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులు రాజు, సతీష్‌ విజ్ఞప్తిమేరకు నాగిరెడ్డిపేట పీహెచ్‌సీ డాక్టర్‌ సృజన్‌తోపాటు ఇతర వైద్య సిబ్బంది విద్యార్థులకు రక్తం గ్రూపులు, వాటి వర్గీకరణ, వ్యాధులు, వ్యాధి నిరోధక టీకాలు తదితర అంశాలను వివరించారు. వ్యాధి నిర్ధారణ పరికరాల సహాయంతో ప్రయోగపూర్వకంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, వైద్యసిబ్బంది హరిసింగ్‌, సునంద, మణెమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ నూతన శకానికి నాంది

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



నూతన రేషన్‌ కార్డులను అందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: రేషన్‌ కార్డుల పంపిణీ కార్యక్రమం నూతన శకానికి నాంది అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ రావు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రేషన్‌ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి డివిజన్‌ పరిధిలో నూతనంగా ఇప్పటి వరకు 5,647 మందికి రేషన్‌ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్‌ కార్డులను ఇస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. 10 సంవత్సరాల తరువాత బీద వారి కళ్లలో ఆనందం వెల్లివిరిసిందన్నారు. బీదవారికి రేషన్‌ కార్డులను అందించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనంతరం నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు రేషన్‌ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి తహసీల్దార్లు ప్రేమ్‌కుమార్‌, సురేష్‌, ఎల్లారెడ్డి, గాంధారి మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్లు రజిత, పరమేష్‌, కాంగ్రెస్‌ పార్టీ మండలాల అధ్యక్షులు సాయిబాబా, నారాగౌడ్‌, శ్రీధర్‌గౌడ్‌, కాంగ్రెస్‌ నాయకులు కుడుముల సత్యనారాయణ, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

లింగంపేట(ఎల్లారెడ్డి): తెలంగాణ రాష్ట్రంలో మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్‌ ప్రభుత్వ లక్ష్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శుక్రవారం లింగంపేట జీఎస్‌ఆర్‌ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన నియోజక వర్గస్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులను బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందజేసి మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు రూ. 20 కోట్ల చెక్కును అందజేశారు. అలాగే లోన్‌ బీమా, ప్రమాద బీమాకు చెందిన రూ. కోటి చెక్కును సభ్యులకు అందజేశారు. సెర్ప్‌ డైరెక్టర్‌ శ్రీగోపాలరావు, డీఆర్‌డీవో సురేందర్‌, ఏపీడీ విజయలక్ష్మి, ఎల్లారెడ్డి ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ రాజు, లింగంపేట సొసైటీ చైర్మన్‌ దేవేందర్‌రెడ్డి, డీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లు అందించాలి



భిక్కనూరు: దివ్యాంగులుగా ఉండి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందని వారిని గుర్తించి, వారికి సదరం సర్టిఫికెట్లు అందించాలని రాష్ట్ర సెర్ప్‌ డైరెక్టర్‌ గోపాల్‌ రావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. దివ్యాంగ విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా సిబ్బంది కృషి చేయాలని, వారికి ఆట వస్తువులు అందించాలని సూచించారు. దివ్యాంగ పెన్షన్లు పొందని వారికి పెన్షన్లు అందేలా చూడాలన్నారు. డీఆర్డీవో సురేందర్‌, డీపీఎం శోభారాణి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌, సీసీలు, దివ్యాంగ పునరావాస కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొత్త రేషన్‌కార్డుల పంపిణీ

బాన్సువాడ రూరల్‌: మండల కేంద్రంలోని రెడ్డి సంఘం ఫంక్షన్‌హాల్‌లో శనివారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడ, బీర్కూర్‌, నస్రుల్లాబాద్‌ మండలాల్లో నూతనంగా మంజూరైన రేషన్‌ కార్డులను పంపిణీ చేస్తారని తహసీల్దార్‌ వరప్రసాద్‌ తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా లబ్ధిదారులకు సమాచారం అందించామని, సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆగ్రో ఇండస్ట్రీస్‌ చైర్మన్‌ కాసుల బాలరాజు, సబ్‌ కలెక్టర్‌ కిరణ్మయి హాజరవుతారన్నారు.

కేంద్రీయ విద్యాలయం కోసం స్థల పరిశీలన

మద్నూర్‌(జుక్కల్‌): మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌ హౌస్‌ ఖాళీ స్థలాన్ని కేంద్రీయ విద్యాలయం కోసం కేటాయించడంతో రెవెన్యూ అధికారులు శుక్రవారం స్థలాన్ని సర్వే చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ మాట్లాడుతూ.. స్థల కొలతలు తీసుకున్నామని తెలిపారు. మొత్తం నాలుగు ఎకరాల వరకు స్థలం ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు. ఆర్‌ఐ శంకర్‌, పంచాయతీ కార్యదర్శి సందీప్‌, సర్వే అధికారులున్నారు.

పెద్ద చెరువు నీటి విడుదల

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ ఎల్లారెడ్డి పెద్ద చెరువు నుంచి ఆయకట్టుకు నీటిని శుక్రవారం ప్రారంభించారు. పెద్ద చెరువు పరిధిలో గల గ్రామాల ఆయకట్టుకు నీటిని వదిలినట్లు రైతులు పేర్కొన్నారు. రైతులు చెరువు నీటిని వృథా చేయకుండా చూసుకోవాలని సూచించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



బీబీపేటలో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న అధికారులు

బీబీపేట: ఇంటి చుట్టుపక్కల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో పూర్ణ చంద్రోదయ కుమార్‌ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా బీబీపేటలో పలు కాలనీలను సందర్శించారు. ఇళ్లలోనిని నీటి కుండీలలో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. దోమలు వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఆయన వెంట కార్యదర్శి రమేష్‌, ఆరోగ్య సిబ్బంది హరిప్రసాద్‌, ఆశా వర్కర్లు ఉన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా ఇంటిచుట్టూ, గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో బాలకృష్ణ అన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా పొందుర్తి, శివాయిపల్లి గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి నీటి నిల్వలు, త్రాగునీరు నిర్వహణ పరిశీలించారు. మండల ప్రత్యేక అధికారి అపర్ణ, ఎంపీవో రఘురాం, తదితరులున్నారు.

క్రైం కార్నర్‌

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

నిజామాబాద్‌ లీగల్‌: భార్యను చంపిన కేసులో భర్తకు నిజామాబాద్‌ మొదటి అదనపు జిల్లా కోర్టు జీవితఖైదు శిక్ష విధించింది. వివరాలు ఇలా.. జక్రాన్‌పల్లి మండలం గన్యాతండాకు చెందిన కేలోత్‌ శ్రీనివాస్‌, భార్య సరిత పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. మద్యానికి బానిసైన శ్రీనివాస్‌ తరచు భార్యతో గొడవ పడుతుండే వాడు. ఈక్రమంలో మార్చి 1, 2025న కుటుంబ పోషణ విషయంలో సరిత తన భర్తతో గొడవ పడింది. అనంతరం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను వెంటనే స్థానికులు అడ్డుకోగా, కొద్దిసేపటికే ఇంటికి వచ్చిన శ్రీనివాస్‌కు తన కూతురు ఈ ఘటనను వివరించింది. అనంతరం భార్యతో అతడు గొడవపడి గొడ్డలి కామతో కొట్టి చంపి, పరారయ్యాడు. మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, శ్రీనివాస్‌ను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చారు. విచారణ చేపట్టిన జడ్జి జీవీఎస్‌ భరతలక్ష్మి నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ. 5000 జరిమానా విధించింది. పోలీసుల తరపున పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ లక్ష్మీనారాయణ వాదించారు.

బైక్‌ చోరీ కేసులో నిందితుడికి 8నెలల జైలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బైక్‌ చోరీకి పాల్పడిన నిందితుడికి 8 నెలల జైలు శిక్ష విధిస్తు ఎల్లారెడ్డి మున్సిఫ్‌ కోర్టు న్యాయమూర్తి సుష్మ శుక్రవారం తీర్పు వెలువరించినట్లు ఎస్సై మహేష్‌ తెలిపారు. వివరాలు ఇలా.. లింగంపేట మండలంలోని రాంపూర్‌ గ్రామానికి చెందిన బాబు తన బైక్‌ను గత ఏడాది జనవరి 4న ఎల్లారెడ్డిలోని వెంకటేశ్వర హాస్పిటల్‌ ఆవరణ ఉంచాడు. పెద్దకొడప్‌గల్‌ మండలంలోని బేగంపూర్‌తండాకు చెందిన చవాన్‌ సుభాష్‌ సదరు బైక్‌ను చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని పట్టుకున్నారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా, సాక్షులను విచారించిన అనంతరం సుభాష్‌కు న్యాయమూర్తి 8 నెలల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తు తీర్పు వెలువరించారు.

గంజాయి విక్రయిస్తున్న వృద్ధురాలు అరెస్టు

ఖలీల్‌వాడి: నగరంలోని ద్వారకనగర్‌ గంజాయి విక్రయిస్తున్న ఖాజీబీ అహ్మదీబేగం అనే వృద్ధురాలిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఏడీ స్వప్న తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఖాజీబీ ఇంట్లో అధికారులు తనిఖీలు చేపట్టగా 450 గ్రాములు ఎండు గంజాయిను పట్టుకున్నారు. అలాగే 2 ఫోన్లను స్వాధీనం చేసుకొని, ఆమెను అరెస్టు చేశారు. నిందితురాలిపై గతంలో పలు కేసులు ఉన్నాయని, కొన్ని సంవత్సరాలుగా రహస్యంగా ఎండు గంజాయి విక్రయిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎస్సై నర్సింహాచారి, సిబ్బంది రాజన్న, భూమన్న, శ్రీనివాస్‌, ప్రసాద్‌ శ్యామ్‌ సుందర్‌, కానిస్టేబుళ్లు భోజన్న, సమీర్‌, శివ, గంగారమ్‌, శ్యామ్‌ తదితరులు ఉన్నారు.

ఆలయంలో చోరీ

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని కేశాపూర్‌ గ్రామంలోగల మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో చోరీ జరిగినట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్‌ తెలిపారు. ఆలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చొరబడి రూ.15 వేలు, రెండు గ్రాములు బంగారం, రెండు తులాల వెండి అభరణాలను ఎత్తుకెళ్లారన్నారు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయినట్లు వివరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వాటర్‌ ట్యాంకర్‌ బోల్తా



నస్రుల్లాబాద్‌: మండలంలోని జాతీయ రహదారి పనులకు ఉపయోగిస్తున్న వాటర్‌ ట్యాంకర్‌ శుక్రవారం అదుపు తప్పి బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. నీటిని సరఫరా చేసి మళ్లీ నింపుకోవడానికి వెళుతుండగా కామిశెట్టిపల్లి నీలం కట్ట ప్రాంతంలో వాహనం అదుపు తప్పిందన్నారు. డ్రైవర్‌ చాకచక్యంతో దూకేయడంతో ప్రమాదం తప్పిందన్నారు.

పథకం ప్రకారమే కోనాపూర్‌ దారి దోపిడీ

- ముగ్గురు నిందితుల అరెస్ట్‌
- నగదు, మొబైల్‌ ఫోన్‌లు స్వాధీనం



కమ్మర్‌పల్లిలో వివరాలను వెల్లడిస్తున్న భీమ్‌గల్‌ సీఐ పొన్నం సత్యనారాయణ

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్‌ గ్రామ శివారులో బుధవారం జరిగిన దారి దోపిడీ అంతా పథకం ప్రకారమే జరిగిందని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ఘటనలో బాధితుడి వెంట వచ్చిన వ్యక్తే కుట్రదారుడు కాగా, మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి కుట్ర పన్ని దోపిడీకి పాల్పడ్డారు. నిందితులను అరెస్టు చేశారు. కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం భీమ్‌గల్‌ సీఐ పొన్నం సత్యనారాయణ వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం జోగినపల్లికి చెందిన కొమ్ము లక్ష్మీనారాయణ అనే వ్యక్తి వరికోత యంత్రం కొనుగోలు చేయడానికి రూ. 3.50 లక్షల నగదుతో భీమ్‌గల్‌ మండలం పల్లికొండకు ఈనెల 16న బయలుదేరాడు. అతడికి తోడుగా తెలిసిన వ్యక్తి బోదాసు జలంధర్‌ను వెంట తీసుకెళ్లాడు. జలంధర్‌ ఆ డబ్బులను కాజేయాలని కుట్ర పన్ని ఈ విషయాన్ని కొన్ని రోజులకు ముందే గుంటూర్‌ జిల్లా సత్తెనపల్లెలో ఉండే వరుసకు అన్నయ్య అయ్యే బోదాసు రాజశేఖర్‌కు ఫోన్‌లో సమాచారం అందించాడు. ఈ విషయం రాజశేఖర్‌ తన బావమరిది ప్రసాద్‌కు చెప్పి కుట్రపన్నారు. ఈక్రమంలో జలంధర్‌ వారిని కోరుట్ల ప్రాంతానికి రప్పించాడు. అనంతరం జలంధర్‌ లక్ష్మీనారాయణతో కలిసి బైక్‌పై పల్లికొండకు బయలుదేరారు. కోనాపూర్‌ శివారులోని అటవీ ప్రాంతానికి చేరుకోగానే, అక్కడే మాటు వేసి ఉన్న రాజశేఖర్‌, ప్రసాద్‌లు స్కూటీపై వచ్చి వారి బైక్‌ను అడ్డగించారు. కత్తులు చూపి బెదిరించి లక్ష్మీనారాయణ వద్ద నుంచి రూ. 3.50 లక్షల నగదు, రెండు మొబైల్‌ ఫోన్‌లు ఎత్తుకెళ్లారు. జలంధర్‌పై అనుమానంతో దర్యాప్తు చేసిన పోలీసులు సాంకేతిక సహాయంతో సమాచారం సేకరించారు. మెట్‌పల్లి లాడ్జీలో ఉన్న జలంధర్‌, బోదాసు రాజశేఖర్‌, ప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ. 3.45 లక్షల నగదు, కత్తి, స్కూటీ, మొబైల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దోపిడీకి పాల్పడింది తామేనని నిందితులు అంగీకరించనట్లు సీఐ పేర్కొన్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై అనిల్‌రెడ్డిని, ఐడీ పార్టీ కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌ కేసుల్లో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలో పోలీసులు ఇటీవల డ్రంకెన్‌ డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా 11మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారికి ట్రాఫిక్‌ ఏసీపీ మస్తాన్‌ అలీ ఆదేశాల మేరకు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ శుక్రవారం కౌన్సెలింగ్‌ నిర్వహించిన అనంతరం నగరంలోని సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ ఎదుట హాజరు పర్చారు. జడ్జి వారిలో 9 మందికి రూ. 14500 జరిమానా విధించి, ఒకరికి రెండు రోజులు, మరొకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

నవీపేట మండలంలో..

నవీపేట: మండలంలో పోలీసులు ఇటీవల డ్రంకెన్‌ డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా ఎలికె ఫారమ్‌ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతు పట్టుబడ్డారు. అతడిని పోలీసులు శుక్రవారం నిజామాబాద్‌కోర్టులో హాజరుపర్చగా, జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు.

బోధన్‌ పట్టణంలో..

బోధన్‌ టౌన్‌ (బోధన్‌): పట్టణంలో ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్‌ తనిఖీలు నిర్వహించగా కోటగిరి మండలం సులేమాన్‌ నగర్‌ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. అతడిని పోలీసులు శుక్రవారం బోధన్‌ కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒకరోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్‌హెచ్‌వో వెంకటనారాయణ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి వాగు నుంచి ఇసుకను తోడి జన్నెపల్లి వైపు వెళ్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే శుక్రవారం వేకువ జామున వాగు నుంచి ఇసుకతో బయటకు వస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

మాక్లూర్‌ మండలంలో..

మాక్లూర్‌: మండలంలోని మాణిక్‌భండార్‌ చౌరస్తా వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను శుక్రవారం తెల్లవారుజామున టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు పట్టుకుని మాక్లూర్‌ పోలీసులకు అప్పగించారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు నిఘా ఉంచి, టిప్పర్‌ను పట్టుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఇసుకతో ఉన్న టిప్పర్‌ తమ ఆధీనంలో ఉందని తదుపరి చర్యల కోసం విచారణ చేపట్టినట్లు ఎస్సై రాజశేఖర్‌ తెలిపారు.

ఫారెస్ట్‌ అధికారుల అడ్డగింత



వర్ని: వర్ని ఫారెస్ట్‌ రేంజ్‌ పరిధిలోని సిద్దాపూర్‌ అటవీ ప్రాంతంలో గిరిజనులు వేసిన మొక్కజొన్న పంటను శుక్రవారం అటవీశాఖ అధికారులు ధ్వంసం చేయడానికి యత్నించారు. విషయం తెలుసుకున్న గిరిజనులు వెంటనే వారిని అడ్డుకున్నారు. సుమారు 15 ఎకరాల స్థలంలో గిరిజనులు మొక్కజొన్న పంట వేయగా అటవీ భూమిని కబ్జా చేస్తున్నారని అధికారులు పేర్కొంటూ, ధ్వంసం చేయడానికి యత్నించారు.